నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I హైదరాబాద్, ఆదివారం 4 మే 2025 SIDDIPET


## దేవాదుల పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి కాల్వ పనులు చేపట్టాలి
- నీటిపారుదల సమీక్షలో మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


దేవన్నపేట పంపు హౌస్‌లో మంత్రులు, అధికారులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 3: దేవాదుల పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయించాలని, మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు పెండింగ్ ఉన్న సాగునీటి కాల్వ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయించాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీసుకుపోయారు. శనివారం హనుమకొండ జిల్లా దేవన్నపేట పంపుహౌస్ వద్ద దేవాదుల మూడోదశ పనులను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లు వాటి పరిస్థితులు, పెండింగ్ పనుల గురించి మంత్రి ఉత్తమ్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. తపాస్‌పల్లికి మల్లన్న సాగర్ గ్రావిటీ ద్వారా నీటిని తీసుకువచ్చే పనులు 25శాతం పూర్తయ్యాయని, ఆ పనులు వేగంగా పూర్తిచేస్తే ధర్మసాగర్ నుంచి గండిరామారం మీదుగా తపాస్‌పల్లి వెళ్లే భారం తక్కువ అవుతుందన్నారు. ఫలితంగా ఘన్‌పూర్, పాలకుర్తి వంటి తదితర ప్రాంతాలకు నీరు ఇవ్వవచ్చని సూచించారు. దేవాదుల ప్రాజెక్టు కెనాల్ పనులు నిలిచిపోయాయని, నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా భూమిని సేకరించి కొంతమందికి పరిహారం ఇచ్చినప్పటికీ, ఇంకా కొంతమందికి ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయినట్లు తెలిపారు. గతంలో భువనగిరిలో జరిగిన సమీక్షంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే పల్లా తెలిపారు. గత సీజన్‌లో నిర్వాహణ డబ్బులు ఆలస్యంగా ఇవ్వడంతో 34రోజులు మోటర్లు ఆపివేయడం దురదృష్టకరమని, ఇక నుంచి నిర్వహణ పనులకు సంబంధించిన నిధులను గ్రీన్ చానెల్ పెట్టాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత


అంగడికిష్టాపూర్‌లో హరితసేన ఆధ్వర్యంలో మొక్క నాటుతున్న కల్లెపు నవీన్‌రావు

మర్కూక్, మే 3: మానవాళి మనుగడ కోసం మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని హరితసేన సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం మర్కూక్ మండలంలోని అంగడికిష్టాపూర్‌లో గ్రీన్ చాలెంజ్ –హరితసేనలో భాగంగా దుర్గామాత దేవస్థానం పరిధిలో మొక్కలు నాటారు. జయన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కల్లెపు నవీన్‌రావు జన్మదినం సందర్భంగా మొక్కలు నాటి,దుర్గామాత ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం చెక్కును అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పుట్టిన రోజున సంబురాలు చేసుకోవడమే కాకుండా నేటి యువత మొక్కలు నాటడం అలవర్చుకోవాలని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవడానికి మొక్కలు నాటడం అవసరం అన్నారు. ఈ అవకాశం కల్పించిన మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హరితసేన కోఆర్డినేటర్ గర్నేపల్లి సతీశ్, అనిల్ మొగిలి, సర్పంచ్ రాములుగౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయక సాగర్‌లో విషాదం

**ఈత కొడుతూ ఇద్దరు విద్యార్థులు మృతి**



అర్బాజ్, మెహరాజ్ మృతదేహాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

చిన్నకోడూరు, మే 3: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో శనివారం విషాదం చోటుచేసుకుంది. వరంగల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందారు. చిన్నకోడూరు ఎస్సై బాలకృష్ణ వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన యాకూబ్ బాబా, యజాలి హలి రెండు కుటుంబాలు హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను వీక్షించడానికి వెళ్లారు. మెహరాజ్ (యువతి), అర్బాజ్ యువకుడు ఇద్దరు రిజర్వాయర్‌లో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయ్యారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మృతులు ఇద్దరు 8వ తరగతి విద్యార్థులు. సిద్దిపేట ఏసీపీ మధు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

## ఇల్లులేక శానా ఇబ్బందులు పడుతున్నం..


మిరుదొడ్డిలో మల్కాపురం నర్సింహులు నివాసం ఉంటున్న ఇల్లు ఇదే

మిరుదొడ్డి, మే 3: మండల కేంద్రం మిరుదొడ్డికి చెందిన మల్కాపురం రాజవ్వ, నర్సింహులు దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు మృతిచెందాడు. కూతురు పెండ్లి చేసినా అల్లుడు చనిపోవడంతో పుట్టింట్లోనే ఉంటున్నది. నర్సింహులు కుటుంబానికి గుంట భూమిలేదు. నిత్యం కూలి పనిచేసిన రెక్కల కష్టంతోనే బతుకు బండిని లాగుతున్నారు. 1974లో ఇందిరాగాంధీ నిర్మించి ఇచ్చిన ఇల్లు తండ్రి నుంచి వారసత్వంగా నర్సింహులుకు వచ్చింది. వర్షాల కారణంగా ఆ ఇల్లు కూలి పోయి మిగిలిన మూడు గజాల వెడల్పు గోడలపై టార్పాలిన్ కప్పుకొని జీవిస్తున్నాడు. వర్షాలు కురుస్తున్న సమయంలో గోడలు ఎక్కడ కూలి మీద పడుతాయోననే భయంతో నిద్రిస్తున్నామని అతను బాధను వ్యక్తం చేస్తున్నాడు. తమకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మల్కపురం రాజవ్వ, నర్సింహులు దంపతులు కోరుతున్నారు.

## ఉన్న గూడును కోల్పోయాం...


బ్రాహ్మణపల్లిలో కొత్త ఇంటి నిర్మాణం వద్ద లబ్ధిదారురాలు ఆశిలి మంజుల–దయానంద్ దంపతులు

నర్సాపూర్, మే 3: ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే ఆశతో ఉన్న ఇంటిని కూలగొట్టుకొని రోడ్డున పడ్డ ఓ బాధితురాలు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఆశిలి మంజుల, దయానంద్ దంపతులకు స్వగ్రామంలో పాడుపడిన ఇల్లు ఉండేది. అందులోనే కొన్నేండ్లుగా జీవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని హామీ ఇవ్వడంతో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లు మంజూరైతది అనుకుని ఉన్న ఇంటిని కూల్చేసి కొత్త ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నారు. అధికారులు ఇంటికి వచ్చి ఫొటోలు తీసుకొని ఇంటిని మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు ఇల్లు మంజూరు గురించి స్పష్టత ఇవ్వడం లేదని ఆశిలి మంజుల–దయానంద్ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.2 లక్షల వరకు అప్పు చేశామని, అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇల్లు.. పేదల గగ్గోలు!

## పైసలిస్తేనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు.. చక్రం తిప్పుతున్న దళారులు

- కాంగ్రెస్ పార్టీ అనుకూలురకే పెద్దపీట
- నిరుపేదలకు మొండిచేయి చూపుతున్న ప్రభుత్వం
- ఇల్లు మంజూరు కోసం ఎదురుచూస్తున్న పేదలు
- జాబితాలో పేర్లు వచ్చినా విచారణ పేరుతో కాలయాపన
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అర్హులకు దక్కని ఇండ్లు
- జాబితాలో పేర్లు లేకపోవడంతో భగ్గుమంటున్న పేదలు
- జీపీలు, మండల ఆఫీసులు, కలెక్టరేట్‌లో ఫిర్యాదుల వెల్లువ
- ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల మంజూరు జాడేదీ?
- ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు 7945 ఇండ్లు మంజూరు
- 1372 ఇండ్లకు మాత్రమే బిల్లుల గ్రౌండింగ్
- బేస్‌మెంట్ లెవల్‌లో 345 ఇండ్లు, 263 ఇండ్లకు బిల్లుల చెల్లింపు


చేర్యాల మండలం ఆకునూరులో కాంగ్రెస్ నాయకులతో కలిసి సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)


ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు (ఫైల్)

> 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది... తాము చెప్పిందే వేదం.. అధికారులు నామ్‌కే వాస్తేగా సర్వేలు చేస్తారు.. ఆ సర్వేలు అన్నీ వట్టివే.. తాము ఎవ్వరి పేరు చెబితే అదే పేరు జాబితాలో వస్తుంది. ఇల్లు కావాలంటే ముందు డబ్బులు ఇవ్వాలి.. మంజూరైన తర్వాత బిల్లులు వచ్చిన కొద్ది ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వాలి'.. అని గ్రామాలు, పట్టణాల్లో దళారుల దందా సాగిస్తున్నారు. ఒక్కో ఇంటికి రూ. 50 వేల వరకు దళారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ పరిస్థితి ఉంది.

సిద్దిపేట, మే 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ ఇంటికి దళారుల డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో చాలాచోట్ల ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. గ్రామాల్లో అధికారులను నిలదీస్తున్నారు. మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ ఫిర్యాదులు బుట్టదాఖలే అవుతున్నాయి. సర్వేకు వచ్చే అధికారులు కాంగ్రెస్ నాయకులను వెంటబెట్టుకొని రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లికి చెందిన దివ్యాంగుడు బీఆర్‌ఎస్ మీటింగ్‌కు వెళ్లాడని అతని ఇందిరమ్మ ఇంటిని రద్దు చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని ముండ్రాయిలో జాబితాలో పేర్లు రావడంతో పాత ఇండ్లు కూలగొట్టారు కొందరు. ఇప్పుడు అధికారులు విచారణ పేరిట అధికారులు కాలయాపన చేస్తుండడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 7945 ఇండ్లు మాత్రమే మంజూరయ్యాయి. బేస్‌మెంట్ లెవల్ వరకు కట్టిన 263 ఇండ్లకు మాత్రమే బిల్లులు ఇచ్చారు. మిగతా చాలామంది బేస్‌మెంట్ వరకు పనులు చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. మరికొంత మంది ఇల్లు మంజూరైందని తెలిసి ముగ్గులు పోసి సిద్ధం ఇంటి నిర్మాణానికి సిద్ధం కాగా పనులు ఆపారు. ఇల్లు వచ్చింది కదా అని ఉన్న ఇంటిని కూలగొట్టుకొని గుడారం వేసుకొని చాలామంది జీవిస్తున్నారు. లబ్ధిదారుల పరిస్థితి రెంటికి రెడ్డ రేవడిలా తయారైంది. ఇటు ఉన్న ఇల్లు పోయింది.. అటు ప్రభుత్వం నుంచి సహకారం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.

**నియోజకవర్గానికి 3500 ఇండ్లెక్కడ..**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ, ఆచరణలో అది అమలు కావడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 శాసనసభా స్థానాలు ఉన్నాయి. వీటితో పాటు హుస్నాబాద్, జనగామ, మానకొండూరు నియోజకవర్గాల మండలాలు ఉన్నాయి. ఈ లెక్కన ప్రభుత్వం చెప్పిన విధంగా ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్ల లెక్క చొప్పున దాదాపుగా 40 వేలు మంజూరు కావాలి. ఇందిరమ్మ ఇండ్లకోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

**సిద్దిపేట జిల్లాలో...**

సిద్దిపేట జిల్లాలో 2667 ఇండ్లు మంజూరయ్యాయి. 665 ఇండ్లకు ముగ్గుపోశారు. 254 ఇండ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేశారు. 135 ఇండ్లకు బేస్‌మెంట్ బిల్లులు చెల్లించారు.

**మెదక్ జిల్లాలో...**

మెదక్ జిల్లాలో 1339 ఇండ్లు మంజూరు చేశారు. 320 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయి. 80 ఇండ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తి కాగా, 47 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఇటీవల రూ లక్ష చొప్పున బిల్లులు ఇచ్చారు.

**సంగారెడ్డి జిల్లాలో...**

సంగారెడ్డి జిల్లాలో 3939 ఇండ్లు మంజూరు కాగా, 387 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయి. బేస్‌మెంట్ లెవల్‌లో 118 ఇండ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 81 ఇండ్లకు బేస్‌మెంట్ బిల్లులు ఇచ్చారు. కొంత మందికి మాత్రమే బేస్‌మెంట్ బిల్లులు ఇచ్చారు. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నది. ఈ డబ్బులు నాలుగు విడతల్లో అందిస్తున్నది.

**సర్వే అధికారుల వెంట కాంగ్రెస్ నేతలు...**

ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామాలు, మున్సిపాలిటీల్లో చేసిన సర్వేలు అంతామాయ అని చెప్పాలి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పడంతో ఆశపడ్డ గూడులేని నిరుపేదలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఆరు విడుతలుగా సర్వేచేశారు. చివరకు ఇందిరమ్మ కమిటీలను వేసి గ్రామసభలో సెలక్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ గ్రామ సభలో కూడా నిరుపేదలకు మొండిచెయ్యి చూపారు. అందులో పూర్తిగా కాంగ్రెస్ పార్టీ అనుకూలురకే చోటు కల్పించారు. అర్హులను పక్కన పెట్టేశారు. పైగా అధికారుల విచారణకు వెళ్లినప్పుడు కాంగ్రెస్ నేతలను వెంట పెట్టుకొని పోయారు. వారు చెప్పిన వారి పేర్లను అధికారుల ఫైనల్ చేసినట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో దళారులు భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కొత్త నిబంధనతో పరేషాన్‌లో లబ్ధిదారులు**

ఏవేవో సాకులు చెప్పి పూర్తిగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం చూస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇందిరమ్మ ఇంటి వైశాల్యం 600 చదరపు అడుగుల్లోపు ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పైగా ప్రభుత్వం విధించిన నిబంధనల మధ్యన లేకపోతే వెంటనే ఆ ఇంటి నిర్మాణాలను రద్దు చేయాలని అధికారులకు సంబంధిత మంత్రి వీసీలో ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు ఇంటి నిర్మాణాలు జరగడం కష్టమే.ఇచ్చేది ఏదో సక్కగా ఇయ్యక ఇన్ని కొర్రీలు ఏంటి అని ప్రభుత్వ తీరుపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల తీరు ఇలా...**

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలో 2667 ఇండ్లు, మెదక్ జిల్లాలో 1,339, సంగారెడ్డి జిల్లాలో 3,939 ఇండ్లు మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో బేస్‌మెంట్ పూర్తిచేసిన వాటిలో కేవలం 263 ఇండ్లకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున బిల్లులు చెల్లించారు.

| జిల్లా | మంజూరు | గ్రౌండింగ్ | బేస్‌మెంట్ | బిల్లుల చెల్లింపు |
|---|---|---|---|---|
| సిద్దిపేట | 2,667 | 665 | 254 | 135 (బేస్‌మెంట్ బిల్లులు) |
| మెదక్ | 1,339 | 320 | 80 | 47 |
| సంగారెడ్డి | 3,939 | 387 | 118 | 81 |
| మొత్తం | 7,945 | 1,372 | 452 | 263 |

## నాలాంటి పేదలకు ఇల్లివ్వరా..



జహీరాబాద్, మే 3: నా పేరు ఔటి కవేరి. ఊరు న్యాల్‌కల్ మండలం చీకూర్తి గ్రామం. రెండేండ్ల క్రితం నా భార్త గుండెపోటుతో చనిపోయాడు. నాకు గుంట భూమి లేదు. కూలీనాలి పనులు చేసుకుని ఇద్దరు పిల్లలతో బతుకుతున్నాను. రేకుల ఇంటిలోనే పిల్లలతో ఉంటున్నాం. ఇటీవల వడగండ్ల వాన, గాలి దుమారంతో ఇంటిపైన ఉన్న రేకుల ఎగిరిపోయాయి. ఇంటిలోని తిండి గింజలు తడిసిపోయి తినడానికి రాకుండా పోయాయి. మమ్మల్ని ఏ అధికారి ఆదుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు మా బాధను అర్థం చేసుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. – ఔటి కవేరి, గ్రామం. చీకూర్తి, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా

## రేకుల ఇంటిలో ఉంటున్నం..



కోహీర్, మే 3: మాది రాజనెల్లి గ్రామం. నిరుపేద కుటుంబం మాది. రేకుల ఇంటిలో ఉంటున్నం. మా గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గ్రామంలో చాలా మంది ఇండ్లను కట్టుకునేందుకు ముందుకు వచ్చారు. అందరిలాగే మేము కూడా ఇంటిని కట్టుకోవాలని అనుకున్నం. లిస్టులో పేరు కూడా వచ్చింది. కానీ, నా భర్త పేరు మీద ట్రాక్టర్ ఉందని ఇంటిని కట్టొద్దని అధికారులు చెప్పిన్రు. అందుకే చేసేదేమి లేకా మా పిల్లలతో కలిసి రేకుల ఇంటిలోనే ఉంటున్నం. ట్రాక్టర్ ఎప్పటికీ మా వద్దనే ఉంటుందా. కొన్ని రోజుల కోసం ఆయన తీసుకొని నడుపుతున్నడు. ఇట్లయితే మేము రేకుల ఇంటిలోనే ఉండలా. మాకు ఇల్లు కావాలి. ప్రభుత్వం న్యాయం చేయాలి.
– షమీమ్, రాజనెల్లి, కోహీర్ మండలం, సంగారెడ్డి జిల్లా

## పేరు తొలిగించి అన్యాయం చేశారు..



ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులకు అన్యాయం చేశారు. కాంగ్రెస్ నాయకుల చెప్పిన వాళ్లకే ఇండ్లు వస్తున్నాయి. అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేశాను. గ్రామసభలో ఇండ్లకు అధికారులు జాబితా తయారు చేశారు. అందులో నా పేరు ఉంది. నాకు తప్పక ఇల్లు వస్తుందని ఆశపడ్డా. గ్రామంలో మళ్లీ సర్వే చేశారు. అందులో నా పేరులేదు. అధికారులు సర్వే చేసినప్పుడు నా పేరు ఉంది. కాంగ్రెస్ నాయకులు చేసినా సర్వేలో నా పేరు లేదు. ఇలా అన్యాయం చేయడం తగదు.
– పాండునాయక్, చోక్లానాయక్ తండా, నాగల్‌గిద్ద, సంగారెడ్డి జిల్లా

## ఇందిరమ్మ ఇంటికోసం ఎదురుచూపు


జాబితా కోసం ఎదురుచూస్తున్న కోరేపు అరుణ

హుస్నాబాద్ టౌన్, మే 3: హుస్నాబాద్ పట్టణంలోని 19వ వార్డుకు చెందిన కోరేపు అరుణ ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నా రు. సొంతిల్లు శిథిలావస్థకు చేరడంతో వేరే చోట కుటుంబమంతా అద్దెకు నివాసం ఉంటున్నారు. వీరికి ఇంటిస్థలం ఉందా లేదా అనే విషయాన్ని పలుమార్లు మున్సిపల్ సిబ్బంది పరిశీలించి వెళ్లారు. ప్రతినెలా మూడు వేల రూపాయల అద్దెను చెల్లిస్తూ కుటుంబమంతా ఉంటున్న వీరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు వస్తాదా రాదా అని ఎదురుచూస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రోజుకో పేరుచేర్చడం, తొలిగించడం జరుగుతుందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో అసలు లబ్ధిదారులను గుర్తించే విషయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా ఆలస్యం అవుతున్నదని తెలుస్తున్నది.

## అర్హులకు అందని ఇందిరమ్మ ఇండ్లు


గుమ్మడిదల: వీరన్నగూడెంలో బేస్‌మెంట్ స్థాయిలో ఆగిన ప్రమీల ఇల్లు


పూరిగుడిసెలో నివాసం ఉంటున్న పొన్నబోయిన మంజుల

**పైలట్ గ్రామంలోనూ పురోగతి లేదు**

గుమ్మడిదల, మే 3: పేదలకు సొంతింటి కల కలగానే మిగిలి పోతున్నది. అర్హులకు కాకుండా అధికార పార్టీ వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని మండలంలోని వీరన్నగూడెంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. కానీ, ఇంటి నిర్మాణాలు బేస్‌మెంట్ లెవల్‌లోనే ఉన్నాయి. 40–60 గజాల స్థలంలోనే ఇల్లు కట్టుకోవాలి.. ఆ ఇంటికి మెట్లు ఉండొద్దు.. రెండు గదులే ఉండాలి అనే నిబంధనలు విధించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెంలో జనవరి 26న గ్రామసభ ఏర్పాటు చేశారు. ఇండ్లకు పలు దరఖాస్తులు రాగా, కేవలం 19 మందికి మాత్రమే ఇండ్లు మంజూరు చేశారు. మిగిలిన వారికి రెండో విడతలో వస్తాయని అధికారులు తెలిపారు. తొలుత మంజూరైన వారిలో 4 మాత్రమే ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. ఇందులో లబ్ధిదారు గాదే సుప్రియ, మరో ముగ్గురు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. వీరికి బిల్లులు రాక పోవడంతో ఎదురు చూస్తున్నారు. చేసిన అప్పులకు మిత్తీలు పెరిగిపోతుండడంతో బిల్లులకు మోక్షం ఎప్పుడు కలుగుతోందోనని వారు ఎదురుచూస్తున్నారు. ఈ గ్రామంలో పూరిగుడిసెలో ఉంటున్న పొన్నబోయిన మంజుల ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నది. పూరి గుడిసెలో బతుకుతున్న తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని, అధికారులను అడిగితే రెండో విడతలో వస్తదని చెబుతున్నారని, తన లాంటి వారికి సర్కారు సాయం అందిస్తే బాగుంటుందని మంజుల ఆవేదన వ్యక్తం చేస్తుంది.

## మాకు గూడు కల్పించండి..

నర్సాపూర్, మే 3: పూరిగుడిసెలో బతకలేక పోతున్నామని, తమకు గూడును కట్టించాలని పేద కుటుంబం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఆశిలి యాదమ్మ కొన్నేండ్లుగా ఇల్లు లేక పూరిగుడిసెలో జీవిస్తున్నది. ఆమె భర్త ఆశిలి నాగరాజు చేసే కూలి పనికి వచ్చే ఆదాయంతో ఇల్లు కట్టుకోలేని దుస్థితిలో ఉన్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇల్లు మంజూరైనట్లు ఏ అధికారి తమకు చెప్పడం లేదని వాపోయారు. అధికారులు ఇంటికి వచ్చి ఫొటోలు తీసుకొన్నారే తప్ప ఇల్లు మంజూరు మాత్రం కావడం లేదన్నారు. వర్షం పడితే గుడిసంతా ఊరుస్తున్నదని, ముగ్గురు పిల్లలతో గడపడం నరకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


బ్రాహ్మణపల్లిలో పూరిగుడిసెలో పిల్లలతో కలిసి జీవిస్తున్న యాదమ్మ

## మాకు ఇండ్లిస్తమని ఆశ పెట్టిండ్రు..



రామాయంపేట, మే 3: మాకు ఇండ్లిస్తమని కాంగ్రెసోల్లు ఆశ పెట్టి ఓట్లేసుకున్నరు. ఇప్పుడేమో మీకు రెండోవిడత వస్తది ఇల్లు అని చెప్తున్నరు. మాకు ఇల్లు లేక కూలిపోయే గుడిసెలోనే ఉంటున్నం. నా భర్తకు పక్షవాతం వచ్చి లేచి నడుస్తలేడు. కనీసం ఇల్లు అయినా మంజూరైతదనుకుంటే అదికూడా ఈ ప్రభుత్వం మంజూరు చేస్తలేదు. వానొస్తే మేము పండుకోవాలంటే చానా ఇబ్బంది ఉంది. ఇల్లు మంజూరు చేస్తే అప్పుచేసి అయినా కట్టుకుంటం.
–కుందెన పద్మ–మల్లేశం, రామాయంపేట


చేర్యాల: మండలంలోని ముస్త్యాల జీపీ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు (ఫైల్)


నంగునూరు మండలం ముండ్రాయిలో అధికారుల కోసం ఎదురుచూస్తున్న వెంకటవ్వ–కొండయ్య దంపతులు


నంగునూరు మండలం ముండ్రాయిలో అర్హుల జాబితాలో పేరు వచ్చినా గుడిసెలోనే నివాసం ఉంటున్న అవుల స్వప్న